

హైదరాబాద్ వార్త

# "డిజిటల్ అరెస్ట్ "...తస్మాత్ జాగ్రత్త ..!

* పోలీస్, ప్రభుత్వ అధికారులమంటే నమ్మొద్దు
* నకిలీ డాక్యుమెంట్లతో బెదిరిస్తే భయపడొద్దు
* వ్యక్తిగత, బ్యాంకు వివరాలు చెప్పొద్దు
* అనుమానం వస్తే 1930కి కాల్ చేయండి
* ప్రజలకు సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక



**హైదరాబాద్, జనవరి 16,ప్రభాతవార్త:** ప్రస్తుతం కొత్త రూపాలలో సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఎంతోమంది ప్రజలు ఈ సైబర్ నేరగాళ్లకు చిక్కి నగదును పోగొట్టుకుంటున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశంలో డిజిటల్ సేవలను చాలామంది వినియోగించుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపు, ఆధార్ కార్డు అప్‌డేట్, బుకింగ్స్, షాపింగ్, ఫామ్స్ నింపడం ఏ పనిచేయాలన్నా ఆన్‌లైన్‌ద్వారా సులువుగా పూర్తి చేసుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ మధ్యకాలంలో డిజిటల్ అరెస్ట్ అనే మోసం ఆర్థిక నేరాలకు సంబంధించిన పెను సమస్యగా మారింది. డిజిటల్ అరెస్ట్ అనేది ప్రభుత్వ అధికారులను అనుకరిస్తూ వీడియో కాల్స్ లేదా ఇతర డిజిటల్ పద్ధతుల ద్వారా బాధితులను భయపెట్టి డబ్బు లేదా సున్నితమైన సమాచారాన్ని లాక్కోవడానికి చేసే ఒక సైబర్ మోసం అని సైబర్ క్రైమ్స్ పోలీసులు తెలుపుతున్నారు. వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

**ఫోన్ లేదా వీడియో కాల్...**

డిజిటల్ అరెస్టులో సైబర్ నేరగాడు బాధితులకు ఫోన్ లేదా వీడియో కాల్‌చేసి పేరుతో సహా వివరాలను అడుగుతాడు. ఈరకమైన మోసంలో మాదకద్రవ్యాలు, స్మగ్లింగ్‌లో వారి ప్రమేయం ఉందని మీపై కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తారు. సైబర్ నేరగాడు అచ్చం పోలీస్‌అధికారి మాదిరిగానే యూనిఫామ్ ధరించి వెనకాల ఒక బోర్డు ఏర్పాటు చేసుకొని ఏమాత్రం అనుమానం రాకుండా నటిస్తారు. నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ ముంబాయి ఇలా వివిధపేర్లు ప్రస్తావిస్తుంటారు.దీంతో ఇది నిజమే అనుకుని సదరు బాధితులు కూడా నమ్ముతుంటారు. ఈ విధంగా బాధితులను భయభ్రాంతులకు గురిచేయడంతో కేసు నుంచి బయటపడాలంటే ఏం చేయాలని బాధితులు ఆ సైబర్ నేరగాళ్లని వేడుకుంటారు. ఈ కేసునుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించుకోవాల్సిందే అని బెదిరిస్తుంటారు. డబ్బులు ఇస్తే జైలుకు వెళ్లకుండా కాపాడతామని సదరు బాధితులను నమ్మించేలా ప్రయత్నం చేస్తారు. ఇలా బాధితులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి నగదు చెల్లించి మోసపోతున్నారు.

**అనుమానం వస్తే 1930కి కాల్ చేయండి...**

ఒకవేళ డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాడు కాల్‌చేసి మీ అబ్బాయి పలానా కేసులో పట్టుబడ్డాడు అని చెప్పగానే వెంటనే వారికి కాల్ చేసి నిజమేనా కాదా అని తెలుసుకోవాలని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ అనేది ఎక్కడా లేదని ఏ పోలీసు అధికారి ఫోన్‌చేసి మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామని చెప్పరన్నారు. ఒకవేళ పోలీసులు మిమ్మల్ని అరెస్టు చేయాలంటే నేరుగా మీ ఇంటి వద్దకే వస్తారని ఇది ప్రజలు తెలుసుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా కాల్ చేస్తే తక్షణమే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.అలాగే 1930 హెల్ప్ లైన్ నెంబర్ లేదా వెబ్‌సైట్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చునని అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు చేయవచ్చని తెలుపుతున్నారు. ముఖ్యంగా సైబర్‌నేరానికి గురైనప్పుడు గోల్డెన్ అవర్ అని ఉంటుందని మోసానికి గురైన బాధితులు గంటలోపు పోలీసులకు ఫిర్యాదుచేయడం ద్వారా మనం వేసిన నగదు ఫ్రీజ్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని ఇలా చేయడం ద్వారా పోగొట్టుకున్న నగదు రాబట్టేందుకు సులభతరం అవుతుంది. ప్రజలు ఈ డిజిటల్ అరెస్టు పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



# ముగిసిన " కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ "

**మూడురోజులపాటు ఆకట్టుకున్న పతంగులు, స్వీట్లు**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో "సెలబ్రేట్ ద స్కై"కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్-2026 సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా ముగిసింది. జనవరి 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పండుగకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జనవరి 13న రాష్ట్ర పర్యాటక, సంస్కృతిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పండుగ రోజులంతా గాలిపటాల ప్రదర్శనలు, మిఠాయిల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ పండుగలో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుంచి 55 మంది కైట్ ప్లేయర్స్ పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అలాగే నిర్వహించిన కైట్స్ ఎగరవేత కార్యక్రమాలు, ప్రత్యేకంగా కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా నిర్వహించిన స్టాల్స్ లలో సిద్ధం చేసిన 1,200కు పైగా తీపి వంటకాలు ప్రదర్శించబడ్డాయి. 60కు పైగా స్వీట్స్ స్టాళ్లు, అలాగే 100కు పైగా చేనేత, హస్తకళలు ఆహార స్టాళ్లు ఏర్పాటు చేయగా, స్థానిక కళాకారులు, చిన్నవ్యాపారులకు ఇది మంచి వేదికగా నిలిచింది.

చివరి రోజున నిర్వహించిన సాంప్రదాయ గిరిజన జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, గిరిజన సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించాయి. పండుగ నిర్వహణ లో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నైలాన్ మంజా వినియోగంపై కఠిన నిషేధాన్ని అమలు చేశారు. ఈ పండుగకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కుటుంబాలు, చిన్నారులు, దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.

భారీ ఎత్తున ప్రజలు పాల్గొనటం తో ఈ కార్యక్రమం ఘన విజయం సాధించింది. వాలెడిక్టరీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి క్రాంతి అధ్యక్షత వహించి, జాతీయ మరియు అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ లకు జ్ఞాపికలను అందజేశారు. పండుగ విజయవంతానికి సహకరించిన వివిధ లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులకు మెమెంటోలు అందజేసి అందరిని అభినందించారు.

**మద్యం మత్తులో**

# అన్నను చంపిన తమ్ముడు

**నాచారం, జనవరి 16 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. మద్యం గ్లాస్ విషయంలో తలెత్తిన చిన్నవివాదం ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటనలో అన్న ప్రాణాలు కోల్పోగా... తమ్ముడు అరెస్ట్ అయ్యాడు. భవనం పైనుంచి అన్నను తోసేయటంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నాచారం వీఎస్‌టీ కాలనీలో ఉండే స్టాఫర్డ్ రోహన్ సేయర్స్(30), తల్లి మిచెల్ రోసారియోతో కలిసి ఉంటున్నాడు. ఇదిలా ఉండగా స్టెప్ మదర్(సవతితల్లి)కి జన్మించిన లియోనార్ ఎంజెలో సేయర్స్(28) రసూల్‌పురాలో ఉంటున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవు ఉండటంతో బుధవారం అర్ధరాత్రి సమయంలో అన్నదమ్ములు ఇద్దరూ నాచారంలో తల్లి ఉండే భవనంపై మద్యం తాగడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో మద్యం గ్లాస్ విషయం, పాత కుటుంబ కలహాలు గుర్తుకు వచ్చాయి. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఇది కాస్త మాట మాట పెరిగి పెద్దదిగా మారింది. మద్యంమత్తులోఉన్న తమ్ముడు క్షణికావేశంలో అన్న రోహన్ సేయర్స్‌ను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మూడో అంతస్తుపై నుంచి కింద పడిపోయిన సోదరుడికి తీవ్ర గాయాలయ్యాయి. భారి శబ్దంతో గమనించిన స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటానాస్థలికి చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వీరి కుటుంబంలో ఆస్తుల విషయంలో తరుచూ గొడవలు జరుగుతుంటాయని స్థానికులు పేర్కొన్నారు.కేసులో తమ్ముడు లయనెల్ ను శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## ఐదో అంతస్తు నుంచి పడి చిన్నారి మృతి

**పేట్‌బషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త :** ఐదో అంతస్తు నుంచి కింద పడి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బోధిపుర విలేజ్, ముంగెలి మండలం చండిఘర్ స్టేట్ నుండి దోమన్ బంజారా, ఆశ బాయ్ బాంజారా దంపతులు నాలుగు నెలల క్రితం బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ వచ్చారు. వారు వారాహి కన్స్ట్రక్షన్ పేస్2 దండ మూడి ఎంక్లేవ్ 5 ఫ్లోర్లో ఈ నెల 12వ తేదిన కూలి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు 5వ ఫ్లోర్ నుండి రెండవ కుమార్తె అన్షిక(3) కిందపడగా చికిత్స నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి 9 గంటలకు చనిపోయినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## స్టీల్ షాపులో అర్ధరాత్రి చోరీ

**బాచుపల్లి, జనవరి 16, ప్రభాతవార్త :** అర్ధరాత్రి ఓ స్టీల్ షాపులో దొంగతనం జరిగిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రగతినగర్ వాసిరెడ్డి స్వీట్స్ లేన్, రుచి క్యారీస్, ప్లాట్ నెం.510, శ్రీ సాయి ప్రకాష్ స్టీల్ షాపులో గురువారం అర్ధరాత్రి తర్వాత వద్ద దొంగతనం జరిగింది. గుర్తుతెలియని దొంగలు సీసీటీ కెమెరా వైర్లను కత్తిరించి, షట్టర్ సెంటర్ లాక్‌ను బలవంతంగా పగలగొట్టి, దుకాణంలోకి ప్రవేశించి, క్యాష్ కౌంటర్ నుండి సుమారు 3 లక్షలు నగదును దొంగిలించారు. ఈ సంఘటనను శుక్రవారం ఉదయం దుకాణ యజమాని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ స్థలాన్ని తనిఖీ చేసి, విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అసలు బంగారంతో వచ్చారు.. నకిలీ అంటగట్టి వెళ్లారు.!

**- జూబ్లీహిల్స్‌లో ఎస్‌కేటీ జువెలర్స్ యజమానికి ఇద్దరు మహిళల టోకరా**

**- ఏడున్నర తులాల బంగారం, రూ. 35వేల నగదుతో ఉడాయింపు**

**జూబ్లీహిల్స్, జనవరి 16, ప్రభాతవార్త :** పండగంటూ ఇద్దరు మహిళలు వచ్చారు..పాత బంగారు ఆభరణాలను మార్చుకుంటామని నమ్మించారు.. అసలు ఆభరణాలను నాణ్యత పరీక్షకు ఇచ్చి అప్పగించే సమయంలో నకిలీ ఆభరణాలను అంటగట్టారు.. ఏడున్నర తులాల బంగారం తీసుకోవడంతోపాటు రూ. 35 వేల నగదును, పండగంటూ వెండి బహుమతిని తీసుకొని ఉడాయించారు.. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో ఎస్‌కేటీ జువెలర్స్ ఉంది. ఈ నెల 14న ఇద్దరు 30 ఏళ్లలోపు ఉన్న మహిళలు జువెలరీ స్టోర్‌కు వచ్చారు. తమ వద్ద 9 తులాల పాత బంగారు ఆభరణాలున్నాయని చూపారు. వాటిని స్టోర్ మేనేజర్ శివమాకుర్ తీసుకొని స్వచ్ఛత పరీక్ష కోసం ఇద్దరు మహిళలతో కలిసి సమీపంలో ఉన్న కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఆభరణాలను పరిశీలించగా నాణ్యతతో ఉన్నట్లు గుర్తించారు. తిరిగి ఆయా ఆభరణాలను ప్యాకింగ్ చేసి మహిళలకు ఇచ్చారు. తిరిగి ముగ్గురు కలిసి జువెలరీ స్టోర్‌కు వెళ్లారు. స్టోర్‌కు వెళ్లిన తరువాత మహిళలు స్టోర్‌లోని వారి దృష్టి మరల్చి అసలు ప్యాకెట్ స్థానంలో నకిలీ ఆభరణాల ప్యాకెట్‌ను పెట్టారు. తాము ఇచ్చిన ఆభరణాలకు బదులుగా 7.50 తులాల బంగారం, రూ. 35వేల నగదు తీసుకున్నారు. పండుగ పూట వచ్చామంటూ బహుమతి సైతం ఇవ్వాలంటూ కోరడంతో స్టోర్ నిర్వాహకులు ఇద్దరికి వెండి కుంకుమకాయలు ఇచ్చారు. అనంతరం మహిళలు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు. మరుసటి రోజు ప్యాకెట్ తెరిచి అందులోని ఆభరణాలను పరిశీలించి ఒక్కసారిగా కంగుతిన్నారు.

నకిలీ ఆభరణాలను అంటగట్టారని అనుమానించి వెంటనే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. దీంతో అసలు వాటిలో నకిలీ ఆభరణాల ప్యాకెట్ పెట్టి మోసగించినట్లు గుర్తించారు. దీంతో శివకుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు మహిళలను పోలీసులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. వారి కోసం జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు గాలిస్తున్నారు.



అటవిశాఖ అధికారికి నెమలిని అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

## గాయపడిన నెమలిని క్షేమంగా అప్పగించిన ఇన్‌స్పెక్టర్

**చాంద్రాయణగుట్ట, జనవరి 16, ప్రభాతవార్త :** అడవిలోని పచ్చని చెట్లపై చెంగు చెంగున ఎగురుతూ వయ్యారాలు వలక బోయాల్సిన ఒక మయూరం (నెమలి) దారితప్పింది. కాంక్రీట్ జంగల్‌లాంటి నగరంలోకి ప్రవేశించింది. తీవ్ర గాయాలతో ఎగురలేని పరిస్థితిలో ఉన్న ఆ నెమలిని ఒక జంతు ప్రేమికుడు పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. వివరాలలోకి వెళితే... ఫలక్‌నుమా జహనుమా ప్రాంతంలోని ఒక శ్మశానవాటికలో తీవ్రగాయాలతో కదలలేకుండా ఉన్న ఒక నెమలిని గమనించాడు రషీద్. వెంటనే దానిని తీసుకొని ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్యను ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య వెంటనే అటవీశాఖ అధికారులకు కబురు చేశాడు. మయూరం పరిస్థితిని వివరించాడు. అనంతరం నెమలిని క్షేమంగా అటవీశాఖ అధికారులకు అప్పగించారు. శ్మాసన వాటికలో పడిఉన్న నెమలిని కాపాడిన రషీద్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**నిజాంపేట్, జనవరి 16, ప్రభాతవార్త :**

బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామంలోని సర్వే నెం.82లోని 2 అక్రమ నిర్మాణాలను శుక్రవారం తహశీల్దార్ సూచనల మేరకు రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వభూములను కబ్జాచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



కూల్చివేసిన అక్రమ నిర్మాణం

# ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా గాలిపటాల పండుగ

**గాలిపటాలు ఎగురవేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గాలిపటాల పండుగ ఘనంగా నిర్వహించారు. గురువారం మకర సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌రాం, కార్యదర్శి సలంద్రి శ్రీని వాసయాదవ్ పాల్గొని గాలి పటాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ప్రాంతానుసారంగా విభిన్న పేర్లతో దేశంలో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటామన్నారు. వ్యవసాయంతో ముడిపడిన సంక్రాంతి పండుగ రైతుల కష్టానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనేది రైతుల పండుగ అని, రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకువచ్చి, సంతోషంగా జరుపుకునే పండుగ అని గుర్తు చేశారు.



ఎన్టీఆర్ స్టేడియంలో గాలిపటాలతో రామచంద్రరావు, బండారు దత్తాత్రేయ

ఈ కార్యక్రమంలో బిజెపి సెంట్రల్‌జోన్ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, రాంనగర్ కార్పొరేటర్ కె.రవి చారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పూస రాజు, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బిజెపి నాయకులు సి.కె.శకంర్‌రావు, జి.వెంకటేష్, మేకల సారంగపాణి, వనం రమేష్, సురేష్‌ముదిరాజ్,పి.ఎన్.చారి, మహేందర్‌బాబు, కేశవరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ పేరును ముక్కలు చేస్తే సహించేదు లేదు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని**

**కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్త:** అస్తిత్వం, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోబోమని, అందుకోసం ఎంతటి పోరాటం చేసేందుకైనా వెనుకాడబోమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. గురువారం బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన బిఆర్‌ఎస్ పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 220 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరు చరిత్రను అనవాలు లేకుండా చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఈ ప్రాంత వాసులు పార్టీలకు అతీతంగా ఈనెల 17వ తేదీన నేడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నల్ల జెండాలు, కండువాలతో ర్యాలీ ప్రారంభమై క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్, సర్కిళ్ల మీదుగా ఎంజి రోడ్డులోని మహాత్మగాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ సాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీకి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్‌బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేశ్ మాజీ బోర్డుమెంబర్లు పాండుయాదవ్, నలిని కిరణ్, అనితా ప్రభాకర్, లోకనాథం, బోయిన్ పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

## మేడిపల్లిలో ఒకే రాత్రి 12 ఇళ్లల్లో చోరీ

**భారీగా బంగారం,వెండి, నగదు అపహరణ**

**హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త :** నగర శివార్లలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సంక్రాంతి పండుగ వేళ దొంగలు బీభత్సం సృష్టించారు.ప్రజలు పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు వెళ్లడాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు, ఒకే రాత్రి వరుస చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. మేడిపల్లి పరిధిలోని చెంగిచెర్ల, అణుశక్తినగర్ కాలనీలలోఈ భారీ దోపిడీలు జరిగాయి. జనవరి 16వ తేదీ తెల్లవారుజామున 1.30 గంటల నుండి 3.30 గంటల మధ్య దొంగల ముఠా తమ పని పూర్తి చేసుకుంది. చెంగిచెర్ల కనకదుర్గ నగర్ కాలనీ ఫేస్4లోని 5 ఇళ్లు, అలాగే అణుశక్తినగర్‌కాలనీలోని మరో 7 ఇళ్లను కలిపి మొత్తం 12 ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దొంగలు ప్రణాళికాబద్ధంగా ఈ దాడులకు పాల్పడ్డారు. వీరు ఒక కారులో కాలనీలోకి ప్రవేశించి.. చేతుల్లో కత్తులు ధరించి వీధుల్లో సంచరించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, తలుపులు, అల్మారాల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇళ్లలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, నగదును దోచుకుని చాకచక్యంగా పరారయ్యారు.

**ముందస్తు రెక్కీ...**

దోపిడీకి ముందు దొంగలు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం రెండురోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు చెట్లకు మందులు కొడుతున్నామనే నెపంతో కాలనీలో అనుమానాస్పదంగా తిరిగారు. ఆ సమయంలోనే ఏఏ ఇళ్లకు తాళాలువేసి ఉన్నాయి.. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయనే విషయాలను వారు గమనించినట్లు పోలీసులు భావిస్తున్నారు. పండుగకు వెళ్లే వారి సమాచారాన్ని సేకరించి చోరీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో మేడిపల్లి పోలీసులు రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. కాలనీలోని వివిధ ప్రాంతాల్లో అమర్చిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇందులో నిందితులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్న, కారులో పారిపోతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక బృందాలు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.






పరేడ్ గ్రౌండ్స్‌లో కనువిందుగా హాట్ ఎయిర్‌బెలూన్ ఫెస్టివల్




గోల్‌కొండ వద్ద హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్




మాట్లాడుతున్న అమానుల్లాఖాన్, ఇనాయత్ ఆలీ భాఖ్రీ

## 20న ఆటో డ్రైవర్ల ధర్నా

**సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాం డ్లను అమలుచేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన 'ఆటో బంద్-షరాబ్ హటావో-తెలంగాణ బచావో'పేరిట ఇందిరాపార్కువద్ద వేలాది మంది ఆటో డ్రైవర్లతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహాత్మాగాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఏసి కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్, తెలంగాణ లేబర్ వేల్ఫేర్ ఫెడరేషన్ (ఐఎల్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు ఇనాయత్ ఆలీ భాఖ్రీ తెలిపారు. గత 12 ఏళ్ళుగా పెంచని ఆటో మీటర్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని, ఏడాదికి 12 వేల రూపాయలు ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు ఇవ్వాల్సిన రెండేళ్ల ఆర్థిక సహాయం 24 వేలు తక్షణమే ఇవ్వాలని, రిజిస్టర్ చేసిన కొత్త ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ చలానాలు ప్రజల బ్యాంకుల ఖాతాల నుంచి ఏచట్టం ప్రకారం వసూలు చేస్తారో, ఫైనాన్షియర్‌ల దోపిడిని అరికట్టడానికి ఏలాంటి చర్యలు తీసుకుంటారో సిఎం సమాధానం చెప్పాలని, ఆర్టీసీ బస్ చార్జీలు పెంచినప్పుడు ఆటో మీటర్ చార్జీలు ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. 20వ తేదీన జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## మహిళల సంక్షేమానికి కృషి : పద్మ




సమావేశంలో పాల్గొన్న రోకో పద్మ, అనురాధ, లలిత తదితరులు

**సైఫాబాద్, జనవరి 12 ప్రభాతవార్త:** గౌతమ బుద్ధుడు తాత్విక చింతన తో, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్, రమాబాయి ఆశయాలతో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి వెలివాడ తొలిపొద్దు రమాబాయి మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ కృషిచేస్తుందని అసోసియేషన్ న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది రోకా పద్మ చెప్పారు. మహిళలు విద్యా, ఉద్యోగ తదితర రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం వీర్‌నగర్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. మహిళలు తాము అభివృద్ధి చెందడంతోపాటు అట్టడుగున ఉన్న మహిళలకు చేయూత నిచ్చి అభివృద్ధికి తోడ్పాడాలని, అప్పుడే మహనీయుల ఆశయాలు అమలు జరిగినట్లని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీర్‌నగర్ పంచాయితీ కమిటీ ముఖ్య అధ్యక్షుడు టంటం గట్టయ్య, ఎస్.చెన్నయ్య, మోహనరావు తోపాటు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు బొట్టు అనురాధ, మూలె లలిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం 'గృహజ్యోతి' : కొండెపూడి చంటిబాబు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు.

**మెహిదీపట్నం, జనవరి 16, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పేదలకు వరంలా మారిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గోల్కొండ జగదాంబికా దేవాలయ చైర్మన్ కొండపూడి చంటి బాబు అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం లంగర్ హౌస్ డివిజన్ పరిధిలోని గృహ జ్యోతి లబ్ధిదారులకు ఆయనతో పాటు విద్యుత్ అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం 6 గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గృహజ్యోతి పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లంగర్‌హౌస్ డివిజన్ పరిధిలోని బాపు నగర్, అంబేద్కర్‌నగర్, వినాయకనగర్, రెడ్డి కాలనీలలోని లబ్ధిదారులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గృహజ్యోతి పథకం సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమానందం, ఆకుల చంద్రశేఖర్, గడ్డం శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు గౌని సంతోష్ గౌడ్ విద్యుత్ అధికారులు మాధవరావు, సాంబశివ, రవీందర్, నసీముద్దీన్, షేక్ సుల్తానా, నిఖిలేష్, శివకుమార్, రమేష్ ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గోదాదేవి అమ్మవారికి కరీనోము ఉత్సవం

**చిక్కడపల్లి జనవరి 16 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం గోదాదేవి అమ్మ వారికి కరీనోము ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతోగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఆలయం అసిస్టెంట్ కమిషనర్ కె. రామాంజనేయులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్య లో తరలివచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదాదేవి కృపకు పాత్రులయ్యారు.

## భవానిదేవికి సుశీలనారాయణరెడ్డి సాహితీ పురస్కారం

**చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ప్రతిఏటా విఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి సతీమణి సుశీల పేరిట ప్రదానంచేసే సుశీలనారాయణరెడ్డి సాహితీ పురస్కారానికికి 2026 సంవత్సరానికిగాను ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవాని దేవిని ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఏంకె రాము తెలి పారు. గతంలో ఈ పురస్కారం ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, డాక్టర్ ఆనందారామం,వాసిరెడ్డి సీతా దేవి, తెన్నేటి హేమ లత తదితరులు అందుకున్నారు రచయిత్రులు ప్రతిష్టాత్మకం గా భావించే ఈ అవార్డు గా లక్ష రూపాయల నగదు తో పాటు ప్రశంసా పత్రం జ్ఞాపిక ప్రదానం చేస్తారు. చిల్లర భవాని వివిధ సాహితీ ప్రక్రియలలో ప్రసిద్ధ రచనలు చేశారు స్వతంత్ర అనంతర కాలంలో తెలుగు హిందీ కవిత తులనాత్మక పరిశీలన అంశం పై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు

## కనులపండువగా గోదా రంగనాథస్వామి కళ్యాణం

**చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) :** వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన గోదా రంగ నాథస్వామి కళ్యాణం కనులపండువగా సాగింది. ఈఓ మాచర్ల జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.



ఆంజనేయ స్వామి దేవాలయంలో గోదా రంగనాథస్వామి కళ్యాణం

# రేపు సికింద్రాబాద్‌లో 'లోహ్రి సగనా ది' వేడుకలు




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దీపక్‌కుమార్ జైరథ్, ప్రతినిధులు

**సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త:** పంజాబ్ రాష్ట్రంతో పాటు ఉత్తర భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పండుగలలో ఒకటైన లోహ్రి పండుగను ఈ నెల 18వ తేదీన సికింద్రబాద్‌లో లోహ్రి మేళా పేరిట 27వ 'లోహ్రి సగనా ది' వేడుక లను నిర్వహిస్తున్నామని పంజాబీ సేవా సమితి అధ్యక్షుడు దీపక్‌కుమార్ జైరథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దీపక్‌కుమార్ జైరథ్‌తోపాటు సమితి మాజీ అధ్యక్షుడు ప్రదీప్ లూంబా, ఉపాధ్యక్షుడు జగ్మోహన్ స్చదేవ్ కలిసి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. శీతాకాలం చివరిలో పంజాబీ కుటుంబాలు ఈ లోహ్రి పండుగను అత్యంత వైభవంగా, సాంప్రదాయ బద్దంగా కొనసాగుతున్నదన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 18న సికింద్రాబాద్ లోని టివోలీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజున జరిగే వేడుకల్లో పంజాబీ ప్రజలు రంగు, రంగుల వస్త్రాలను ధరించి ఆవుపేడతో లోహ్రి దేవతను తయారుచేసి పూజించి కట్టెలు కాల్చి మంటలు వేసి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ నువ్వులు, బెల్లం, రేవడిలను వేస్తూ లోక కళ్యాణం కోసం ప్రార్ధనలు చేస్తూ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుకోవడం జరుగుతుందన్నారు. రాజ్‌కుమార్ గణోత్ర మాట్లాడుతూ జంట నగరాల్లో నివసిస్తున్న పంజాబీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి పంజాబీల సంప్రదాయాలను, వారసత్వాన్ని పరిరక్షించుకోవడానికి పంజాబీ సేవా సమితి ప్రతి ఏడాది ఈ వేడుకలను నిర్వహిస్తున్నద న్నారు.

కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అలాగే 'సుందర్ ముద్రియేహో' తోపాటు క్లాసిక్ పంజాబీ జానపద పాటలను ప్రముఖ పంజాబీ గాయకులు గీతాలను ఆలపిస్తారని ఆయన వివరించారు.



మల్లన్న స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## ఘనంగా ముగిసిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

**ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** ముషీరాబాద్ బాకారం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈనెల 14వ తేదీ ఏకాదశి నాడు స్వామివారికి పంచామృత అభిషేకాలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. అర్చనలు, ఎదుర్కోలు, గంగ తెప్పోత్సవం, గొలుసు తెంపుట మల్లిఖార్జున స్వామికి, బలిజ మేడాలమ్మ, గొల్ల కేతమ్మ అమ్మవార్లతో కళ్యాణోత్సవం, అగ్నిగుండాల ప్రవేశం, ఈదమ్మ పోచమ్మ దేవాలయంకు బోనాలతో ఉత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సతీసమేతంగా పూజ లలో పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, దేవాలయ పూజారి కే.మధుసూదనాచారి, స్థానిక బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి, గోరఖ్‌నాథ్, బింగి నవీన్, శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాట్ పీజియన్ పబ్ యజమానిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జనవరి 16, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45 లోని ఫ్యాట్‌పీజియన్ పబ్‌యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో ఫ్యాట్ పీజియన్ పబ్ ఉంది. కాగా గురువారం సాయంత్రం రోడ్ నంబరు 45లో సీఎం రూట్ ఉంది. ఈ క్రమంలోనే ఫ్యాట్ పీజియన్‌కు వచ్చే వాహనాలతో రోడ్డుపై ట్రాఫిక్ జాంకు పాల్పడ్డాడు. సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, ఇక్కడ వాహనాల రాకపోకలను అడ్డగించేలా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పబ్ యజమాని కేతన్ అగర్వాల్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతనికి నోటీసులు జారీ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చాలా కాలంగా మూసి ఉన్న ఈ పబ్ ఇటీవలే రిన్నోవేషన్ చేసుకొని తెరుచుకుంది. గతంలోనూ ఈ పబ్‌పై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసులు నమోదై ఉన్నాయి.

## పూల్‌బాగ్ వద్ద పల్టీకొట్టిన కూరగాయల వ్యాన్

**చాంద్రాయణగుట్ట, జనవరి 16, ప్రభాతవార్త :** ఆకుకూరల లోడ్‌తో వెళుతున్న ఒక వ్యాన్ అదుపుతప్పి పల్టీకొట్టింది. పోలీసుల వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీశారు. ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వివరాలలోకి వెళితే.. శుక్రవారం అర్ధరాత్రి కంచన్‌బాగ్ హాఫీజ్‌బాబానగర్ మీదుగా చాంద్రా యణ గుట్ట వైపు వెళుతున్న ఆకుకూరల లోడ్‌తో ఉన్న వ్యాన్ పూల్‌బాగ్ చౌరస్తా వద్దకు రాగానే అదుపుతప్పి నడిరోడ్డుపై పడిపోయింది. విషయం తెలుసుకున్న చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు, సిబ్బంది సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకొని వాహన డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీశారు. వాహనం ముందు అద్దం పగిలిపోయి, ఎడమవైపు పైకప్పు పాడైయ్యింది. నడిరోడ్డుపై ఉన్న వ్యాన్‌ను పక్కకు తొలగించారు. నడిరోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయిన ఆకుకూరల పెట్టెలను వాహనాలకు అడ్డులేకుండా తొలగించారు. ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

**అల్వాల్, జనవరి 16 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒరిస్సా రాష్టానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు భీమ(30) జీవనోపాదికి నగరానికి సంవత్సరం క్రితం వచ్చాడు. ఓల్డ్ అల్వాల్‌లోని లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తులు భవనం వద్ద సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నెల 15 గురువారం సాయంత్రం ఐదు గంటలు సమయంలో ప్రమాదవశాత్తు భీమ ఐదవ అంతస్తు నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆకట్టుకున్న మహిళల జానపద నృత్య ప్రదర్శన

## శిల్పారామానికి తరలివచ్చిన నగర ప్రజలు

**గచ్చిబౌలి, జనవరి 16 ప్రభాతవార్త :** సంక్రాంతి వేడుకల్లో అతి ముఖ్యమైన కనుమ పండుగ సంబరాలకు పట్టణ ప్రజలు శిల్పారామానికి శుక్రవారం తరలివచ్చారు. మాదాపూర్ హైటెక్‌సిటీలోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా పండుగ చివరి రోజు కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు,హరిదాసుల కీర్తనలు, బుడబుక్కల, జంగమదేవరుల, ఎరుకలసాని, పిట్టలదోర తదితర జానపద కళారూపాల ప్రదర్శనలు సందర్శకులను ఆలరించాయి. పని ఒత్తిడి, ఇతర కారణాలతో పల్లెలకు పోలేని నగర వాసులకు శిల్పారామంలో నిర్వహించిన సంక్రాంతివేడుకలు అచ్చమైన పల్లెటూరి సాంప్రదాయాన్ని పరిచయం చేశాయి. సంక్రాంతి పండుగలో అతి ముఖ్యమైన చివరి రోజు వేడుకలు కనుమ పండుగను హైటెక్‌సిటీ శిల్పారామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నగర వాసులు భారీ ఎత్తున తరలిరావడంతో శిల్పారామం శుక్రవారం కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, బుడబుక్కల, జంగమదేవరుల, పిట్టల దోరల వేషదారణలు సందర్శకులకు కట్టిపడేశాయి. సాంక్రాంతి పండుగలో భాగంగా కనుమ వేడుకలల్లో ఉత్సాహంగా పాల్గొన్న సందర్భకులకు సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గౌతమి రవిచంద్ర బృందం ప్రదర్శించిన గోదా కళ్యాణం నృత్య ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతోపాటు పలు ప్రాచీణ సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శిల్పారామానికి కుటుంబంతో పాటు విచ్చేసిన సందర్శకులు ఎడ్లబండి లో శిల్పారామం అంతా తిరిగి గ్రామీణ వాతావరనాన్ని హైటెక్‌సిటీలో అనుభవించారు.

## మహిళా సాధికారత దిశగా రేవంత్ సర్కార్

### అఖిలభారత మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్తేర్ రాణి

**చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతోందని అఖిలభారత మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్తేర్ రాణి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి లో జరిగిన సమావేశంలో ఎస్తేర్ రాణి మాట్లాడుతూ ఇందులో భాగంగా మొత్తం 121సీట్లలో 31 సీట్లు మహిళలకు కేటాయించడం చారిత్రక నిర్ణయమని అన్నారు. ఇది మహిళల రాజకీయ సాధికారత దిశగా తీసుకున్న చారిత్రకమైన మరియు ప్రశంసనీయమైన అడుగు అని అన్నారు. ఈ నిర్ణయం మహిళలపై తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని, లింగ సమానత్వానికి ఉన్న కట్టుబాటును స్పష్టంగా చూపిస్తుందని, పాలనా వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. ఈ సాహసోపేతమైన మరియు దూరదృష్టితో కూడిన నిర్ణయానికి అందరం అండగా నిలవాలన్నారు. ఈ చర్య మహిళలను రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తుందని, సామాజిక న్యాయం, సమతుల్య అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు తాము నిరంతరం పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

### సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు శుభవార్త

## వందేభారత్‌కు పెరిగిన బోగీలు

**తార్నాక, జనవరి 16 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్ తెలిపింది.సికింద్రాబాద్ నుంచి తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో వందే భారత్ రైలు టికెట్లకు డిమాండ్ నెలకొంది. ప్రయాణికుల నుంచి భారీగా డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ రైలు భోగీల సంఖ్యను పెంచింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. వందేభారత్ బోగీల సంఖ్య పెంపు....ఇదిలా ఉంటే 2023 ఏప్రిల్ 9న సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ సర్వీసును దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. వందేభారత్ రైలు ప్రారంభంలో కొన్ని నెలల పాటు 8 బోగీలతో నడిచింది. ప్రయాణికుల నుంచి విపరీతమైన ఆదరణ లభించడంతో బోగీల సంఖ్య డబుల్ చేసింది. అంటే బోగీల సంఖ్య 16కు పెంచింది. తాజాగా వందేభారత్‌కు మరింత డిమాండ్ ఉండటంతో మరో 4 బోగీలను పెంచింది. దీంతో వందేభారత్ ప్రస్తుత రైలు బోగీల సంఖ్య 20కి చేరుకుంది.

# పురానాపూల్‌లో తీవ్ర ఉద్రిక్తత

### రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు.. ఇరువర్గాలపై కేసు నమోదు



సునిశిత బస్తీలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**చార్మినార్, జనవరి 16, ప్రభాతవార్త :** పాతబస్తీ పురానాపూల్ దర్వాజా వద్ద ప్రార్థనా మందిరంలోకి ఒక గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి ప్లెక్సీ, పీవోపి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేయటం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు సకాలం లో జోక్యం చేసుకోని ఇరువర్గాలను శాంతింపచేయ టంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ విషయంలో పోలీ సుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతుంది. వివ రాల్లోకి వెళితే...బుధవారం అర్థరాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో ఒక అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి, ప్రార్థనా మందిరంలోఉన్న ఒక ప్లెక్సీతోపాటు పీవోపి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్‌ప్రభాకర్‌ఖరే, ఇతర పోలీసు అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి చేయిదాటిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై కామాటిపురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ పుటేజీతోపాటు ఇతర ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో భాగంగా నేరస్థుడికి సంబంధించిన కీలక సమాచారం సేకరించారు.త్వరలో నిందితుడిని అరెస్ట్ చేయడం జరుగుతుందని పోలీసు అధికారులు వెల్లడించారు. అయితే ఈ సంఘటన అనంతరం ఒక వర్గానికి చెందిన 300 మంది ఆ ప్రాంతంలో గుమిగూడి, సమీపంలోని మరొక వర్గానికి చెందిన ప్రార్థనా మందిరాన్ని ధ్వంసం చేశారు. పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నించిన పోలీసులపై దాడిచేశారు. ఈ దాడిలో నలుగురు పోలీసు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైయింది. సీసీటీవీ పుటేజీ, వీడియోల ఆధారంగా బాధ్యులను దర్యాప్తు అధికారులు గుర్తించారు. చట్టప్రకారం వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రార్థనా మందిరం ధ్వంసమయ్యాయని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులోనే ఉంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసేవారిపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్‌రావు, గోషామహల్ శాసనసభ్యులు రాజా సింగ్, ఎంపిలు అంజన్‌కుమార్‌యాదవ్, అసదుద్దీన్ ఓవైసీలు సంఘటనస్థలాన్ని పరిశీలించి అధికారులు, స్థానికులతో సంఘటనపై ఆరా తీశారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకో వాలని పోలీసులను, పుకార్లు నమ్మవద్దని ప్రజలను కోరారు. కాగా శుక్రవారం కామాటిపుర, హుస్సేన్‌ఆలం పోలీసులు పురానాపూల్, గొల్లకిడికీ, పార్థివాడ, దేవిబాగ్, పురానాపూల్ దర్వాజా ప్రాంతాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాజిద్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్. కామాటిపుర సీఐ భాస్కర్, హుస్సేన్‌ఆలం సీఐ ఆంజనేయులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిప్రపత్తులతో వీరభద్రస్వామి రథయాత్ర

**చిక్కడపల్లి, జనవరి 16(ప్రభాతవార్త):** ఆధ్యాత్మికతకు అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే వీరభద్ర స్వామి(వంగర) రథయాత్ర జనసంద్రాన్ని తలపించింది. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయం, భక్తికి వారసత్వానికి వారధిగా నిలిచింది. పీవీ తనయుడు పీవీ ప్రభాకర్‌రావు, పీవీ శరత్‌బాబు, పీవీ మదన్ మోహన్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు తదితర కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ యాత్ర అత్యంత వైభవంగా సాగింది. తమ కుటుంబ సభ్యురాలు రత్నమ్మకు పురుష సంతానం కోసం వీరభద్ర స్వామికి మొక్కుకుని, పీవీ నరసింహారావును దత్తత తీసుకోవడం వల్లే ఈ వంశం నేడు ఇలా ఉందనేది మా ప్రగాఢ విశ్వాసం. ఆ కృతజ్ఞతతోనే 1925 ప్రాంతంలో ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని నాన్న తన చివరి శ్వాస వరకు గౌరవించారు. ఆయన దేశ ప్రధానిగా ఉన్నా సరే, వంగర రథయాత్ర విశేషాలను అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు ఆ పవిత్ర బాధ్యతను మోసే అవకాశం మాకు దక్కడం పూర్వజన్మ సుకృతం అని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో స్థానిక ప్రముఖులు మొండయ్య, వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు.

### శ్యామగాయత్రీ మ్యూజిక్ అకాడమీ

## పదమూడవ వార్షికోత్సవ వేడుకలు

**చిక్కడపల్లి, జనవరి 16(ప్రభాతవార్త):** శ్యామ గాయత్రీ మ్యూజిక్ అకాడమీ పదమూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ అధినేత్రి, ప్రముఖ గాయని చిల్లా శివపార్వతి తెలిపారు. 21న నగరంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రముఖ సంగీత దర్శకులు, నేపథ్య గాయకుడు, సంగీత గురువు, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు కొమాండూరి రామాచారి జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ గరికపాటి వెంకట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు తనికెళ్ళ రామకృష్ణ, బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, అమీన్‌పూర్ సూర్య ది గ్లోబల్ స్కూల్ అడ్మిన్ హెడ్ విరాట్, ప్రముఖ సినీ నటుడు గుండు సుదర్శన్, దూరదర్శన్ వ్యాఖ్యాత్రి విజయ దుర్గ, తదితరులు పాల్గొంటారన్నారు. ఆత్మీయ అతిధులుగా ప్రముఖ గాయనీగాయకులు శశికళ స్వామి, విజయలక్ష్మి మ్మ, సురేఖ మూర్తి, వినోద్ బాబు, ఆర్.మాధవి తదితరులు పాల్గొంటారన్నారు.

## మల్లన్న గంగ తెప్ప ఊరేగింపుకు ఘన స్వాగతం...



భక్తిప్రపత్తులతో రథచక్రం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) :** ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ రోజున భక్తిశ్రద్ధలతో జరుపుకునే పెద్ద జాతరను బాకారం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవాలయంలో నిర్వహించారు. జాతర సందర్భంగా ఒగ్గు పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆనవాయితీగా నిర్వహించే మల్లన్నస్వామి వారి పల్లకితో 'గంగ తెప్ప' ఊరేగింపుకు గాంధీనగర్ డివిజన్ బిజెపి ప్రధానకార్యదర్శి వడ్డపల్లి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీలోని శ్రీనల్లపోచమ్మ ఆలయం వద్ద స్వాగతం పలికారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ పూస రాజు, మహంకాళి జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మద్దూరి శివాజీ, సీనియర్ బిజెపి నాయకులు పాల్గొన్నారు. మల్లన్న ఆలయ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి, ఒగ్గుపూజరులతోపాటు ముఖ్య అతిథులను సన్మానించి, స్వామివారి పల్లకికి పూజులు చేసి, సాకలు పెట్టి, గంగ తెప్ప ఊరేగింపుకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీకాంత్, దామోదర్, విఎస్‌టి రాజు, పాల శ్రీనివాస్, మదన్ మోహన్, జ్ఞానేశ్వర్, సాయికుమార్, గ్యనేశ్, సంపత్ యాదవ్,బస్తీ అధ్యక్షుడు ఏళ్లమ్, నరేష్, పి.రాజు, వీరేష్, రాజశేఖర్, హరినాథ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

**చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్నాక్స్ పంపిణి చేయాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు,కాంగ్రెస్ నాయకులు బింగి సాయి కీర్త్ హర్షం ప్రకటించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరలో జరగనున్న ఎస్ఎస్సీ వార్షిక పరీక్షల దృష్ట్యా.. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి వారి చదువుకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం వేళ పౌష్టికాహారాన్ని (స్నాక్స్) అందించాలని, ఈ స్నాక్స్ కోసం ప్రభుత్వం మొత్తం రూ. 4.23 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు మొత్తం 19 రోజుల పాటు ఈ ఉచిత స్నాక్స్ పంపిణీ కొనసాగనుందని అన్నారు. ఈ నిర్ణయం విద్యార్థులలో హాజరు శాతం ఏకాగ్రతను మెరుగు పరుస్తుందని, తద్వారా మంచి ఫలితాలు సాధించడానికి సహాయపడు తుందని విద్యా శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### పండుగ సెలవు ఇవ్వలేదని పారిశుధ్య కార్మికులు

## సిఐటియు ఆధ్వర్యంలో రోడ్డు వంటావార్పు

**చిక్కడపల్లి జనవరి 16(ప్రభాతవార్త):** మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు పండుగ సెలవులు ఇవ్వకపోవటంతో సీఐటీయూ ముషీరాబాద్ జోన్‌కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో గ్యాస్ పోయి పెట్టి సంక్రాంతి ఫలహారాలు చేసుకొని నిరసన వ్యక్తం చేసారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు ఎం.దశరథ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పండుగ సమయంలో కూడా సెలవులు లేకుండా అధికారులు వ్యవహరించిన తీరు చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు పండుగ సమయాలలో అందరిలాగే మున్సిపల్ కార్మికులకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో పారిశుద్ధ్య కార్మికులు ఎండ వాన చలి అని తేడా లేకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం నిరంతరం శ్రమిస్తున్నటువంటి పరిస్థితి ఉంది. వీరికి ఏ పండుగలు వచ్చినా వీరి శ్రమని గుర్తించకుండా అధికారులు నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఏ పండుగ వచ్చినా వీరికి వీరి కుటుంబాలకి సంతోషం లేకుండా నిరంతరం రోడ్ల మీదే జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా అధికారులు వీరి యొక్క బాధలను అర్థం చేసుకొని పండుగల సందర్భంగా వీరు వాళ్ళ పిల్లపాపలతో సంవత్సరానికి ఒకసారి సంతోషంగా గడపడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉన్నతాధికారులు మానవత్వ దృక్పథంతో ఆలోచించాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లా తెచ్చిన బిల్లులకు వ్యతిరేకంగా 19న ఇందిరాపార్క్ దగ్గర జరిగే భారీ ధర్నా జయప్రదం చేయాలని, దేశవ్యాప్తంగా జరిగే సమ్మె ఫిబ్రవరి 12న పాల్గొని మన హక్కులను సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జూన్ కార్యదర్శి టి మహేందర్ నగర ఉపాధ్యక్షులు రాములు నాయకులు శ్రీనివాస్, బాబు లతా జయమ్మ శారద వి. జయ రాజు వెంకటమ్మ మల్లమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## కనుమరోజు పశువులకు పూజలు

**చాంద్రాయణగుట్ట, జనవరి 16, ప్రభాతవార్త :** నాల్గు రోజుల సంక్రాంతి పర్వదినంలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం పశువులను పూజించారు. వాటికి ఇష్టమైన గ్రాసాన్ని తినిపించారు. చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం, పోలీసుస్టేషన్ సమీపం లోని శ్రీ జగన్నాథస్వామి దేవాలయ గోశాలలోని గోవులు, బసవన్నలను యువకులు పాల్వాయి సాయి కిరణ్, రవి రాహుల్, పవన్, తేజేష్, భక్తులు పసుపు, కుంకుమ, పూలమా లలతో అలంకరించారు. పూజలు చేసి హారతి ఇచ్చారు. వాటికి ఎండు, పచ్చిగడ్డి, దానను తినిపించారు. సేవలు చేశారు. మానవాళికి ఎన్నోరకాలుగా మేలు చేస్తున్న పశువులను ఏడాదికోసారి వచ్చే సంక్రాంతి, కనుమ రోజున సేవలు చేయటం ఎంతో పుణ్యమని అర్చకస్వాములు పేర్కొన్నారు.

## కాకతీయ కాలనీలో సిసి రోడ్లు ప్రారంభం



సిసి రోడ్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 16 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ కాకతీయ కాలనీలో రూ.23లక్షలతో చేపట్టిన సిసి రోడ్లను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తున్నామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి వాటి సత్వర పరిష్కారానికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మైసమ్మ దేవాలయ స్థలాన్ని పరిరక్షించాలంటూ కాలనీవాసుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 16 ప్రభాతవార్త:** కృష్ణానగర్‌లో మైసమ్మ దేవాలయానికి చెందిన భూమిని పరిరక్షించాలంటూ కాలనీవాసులు చేపట్టిన ధర్నాకు బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి తమ మద్దతును ప్రకటించారు. దేవాలయానికి చెందిన భూమిని కొందరు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని, దీన్ని తాము అడ్డుకుని తీరుతామని కాలనీవాసులు స్పష్టం చేశారు. అమ్మవారి దేవాలయానికి చెందిన భూమి పరిరక్షణ కోసం తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమని కాలనీవాసులు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి,ఉపాధ్యక్షులు రాములు, కార్యదర్శి దశరథ్,కోశాధికారి అనిల్ పాల్గొన్నారు.

## సీపీఐ శతవసంతాల ముగింపు సభను విజయవంతం చేయాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

**హయత్ నగర్, జనవరి 16 ప్రభాతవార్త:** ఖమ్మంలో ఈనెల 18న నిర్వహించనున్న సీపీఐ శత వసంతాల ముగింపు సభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రావి నారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతాంగ శ్రేయస్సు కోసం సీపీఐ నిరంతరం పోరాడిందన్నారు. ఈ క్రమంలో అనేకమంది అమరులయ్యారన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేదల కోసం భూపోరాటాలు నిర్వహించి వేలాది మంది నిరుపేదలకు నీడ కల్పించిన ఘనత సిపిఐ పార్టీకి దక్కుతుందన్నారు. శతాబ్ది ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి తో పాటుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఇతర జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ,మండల కౌన్సిల్ సభ్యులు సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

## విజయదుర్గ పొదుపుసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**తుర్కయంజాల్ జనవరి 16 (ప్రభాతవార్త)** సంఘం అంచెలంచెలుగా ఎదిగి వేల మంది సభ్యులు, కోట్ల రూపా యల టర్నోవర్ సాధించడం ఎంతో గర్వకారణమని ఆ సంఘం సీఈవో సంగీత అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్ సర్కిల్లో మన్నెగూడ పరిధి ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో విజయదుర్గ పొదుపుసంఘం నూతన సంవత్సర క్యాలెండర్ సంఘం మహిళలతో మరియు నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగీత, సంఘ సభ్యులు మాట్లాడుతూ కేవలం పది మంది సభ్యులతో ప్రారంభమైన పొదుపు సంఘం నేడు ఈ స్థాయికి చేరడంలో సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. నెలకు కేవలం రూ.100 పొదుపుతో ఈ సంఘం నడుస్తోందన్నారు. అతి తక్కువ వడ్డీతో సభ్యులకు రూ.2లక్షల వరకు రుణాలు సంఘంలో అందిస్తుందని అన్నారు. సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. సభ్యులు చనిపోతే వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కొత్తగా చేరే సభ్యులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయదుర్గ పొదుపు సంఘం అధ్యక్షుడు గోదాసు భద్రయ్య, కార్యదర్శి ఆదిమూలం వెంకటాచారి, కోశాధికారి మెట్టు రాణి, సభ్యులు వట్నాల ధనుంజయగౌడ్, పొట్ల జంగయ్యగౌడ్, అంజమ్మ, పండాల కుమార్డ్, పల్స హారిక, గానుగు యాదగిరి, డిల్లి జగన్, పల్లె కుమార్ గౌడ్, కేశవోని రాజు గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాయిబాబా దేవాలయంలో మాస శివరాత్రి పూజలు

**ఎల్.బి.నగర్, జనవరి 16 ప్రభాతవార్త:** మాస శివరాత్రి సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీషిరిడిసాయి బాబా దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ చైర్మన్ శ్యాంకుమార్ తెలిపారు. ఉదయం ఏడు గంటలకు గురుస్తాన్ హారతి, శ్రీ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీఅయోధ్య రామ్‌లల్లా, పాండురంగ విట్టల రుక్మిణి శ్రీమహాలక్ష్మిలకు అలంకారము, పురుష సూక్తము, శ్రీరుద్రహోమము, అభిషేకాలు తదితర కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయంలో నిర్వహించే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కృపకు పాత్రలు కావాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధికి సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు

**మల్కాజిగిరి జనవరి 16, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ని ప్రశాంత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు, కాలనీలో సిసి రోడ్లు డ్రైనేజీ నాలా పైకప్పు కమ్యూనిటీ హాల్ డెవలప్మెంట్ కి సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ లోని అన్ని కాలనీలో ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు జరిగాయని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం బాక్సు డ్రైన్ పనులు జరిగాయని, వరద ముంపు కాలనీలలో చాలావరకు పరిష్కారం లభించిందని, ఓపెన్ జిమ్ మరియు బండ చెరువు వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలో అందుబాటులోకి వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందించే సంక్షేమ పథకాలు డివిజన్లో పెద్ద ఎత్తున అందుతున్నాయని, ముఖ్యంగా గృహ జ్యోతి పథకంలో భాగంగా కరెంటు బిల్లుల భారం తగ్గిందని, ఈ పథకం ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంత్రివర్యులు భట్టి విక్రమార్క లబ్ధిదారులు ఇంటికే ధన్యవాదాలు తెలిపే లేఖలు



అందించారని, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు గారి సహకారంతో, చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన వివరించారు, మల్కాజ్గిరి జోన్ గా ఏర్పడిన సందర్భంగా అభివృద్ధి పనులకి మరింత నిధులు సాధించడానికి ప్రయత్నిస్తానని ఆయన తెలిపారుప్రశాంత్ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి సచిన్, సభ్యులు విజయ్, రత్న భూషణ్, జగదీశ్వర్ రావు, సురేష్, శ్రీనివాసులు మోహన్, రాములు, సత్యనారాయణ, యేసయ్య సీనియర్ నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ఆస్పత్రిలో మదర్ మరియు చైల్డ్ కేర్ యూనిట్ - ఎంబ్రేస్ ప్రారంభం

**ప్రారంభించిన ప్రముఖ సినీనటి భూమికా చావ్లా**

**మన్సూరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** మూడు దశాబ్దాలకు పైగా వైద్యరంగంలో అత్యుత్తమ సేవలందిస్తున్న కామినేని ఆస్పత్రి.. మహిళలు, పిల్లల సంరక్షణ కోసం నిరంతర ఆధునిక వైద్యం అందేలా రూపొందించిన ప్రపంచ స్థాయి సమగ్ర మదర్ మరియు చైల్డ్ కేర్ యూనిట్, ఎంబ్రేస్ ను శుక్రవారం ప్రముఖ సినీ నటి భూమీకా ప్రారంభించారు. తల్లులు, పిల్లలు, మొత్తం కుటుంబాలకు సంపూర్ణమైన, నిరంతర వైద్యం అందించేందుకు ఈ అత్యాధునిక విభాగాన్ని ఆస్పత్రి లో రూపొందించారు. ఈ సందర్భంగా కామినేని ఆస్పత్రి సీఈవో డాక్టర్ గాయత్రి కామినేని మాట్లాడుతూ..ఎంబ్రేస్ ద్వారా మదర్ చైల్డ్ ఆరోగ్య సంరక్షణను అత్యాధునిక వైద్య విధానంతో కొత్త దిశలో సేవలందిస్తున్నామన్నారు. కుటుంబాన్ని సంరక్షణ కేంద్రంగా ఉంచి, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, భావోద్వేగ, పోషక అవసరాలను కూడా సమగ్రంగా చూసుకోవడమే మా లక్ష్యమని, ఆధునిక ఐసీయూలు, కార్డియాక్ సపోర్ట్ వ్యవస్థ, 24/7 బ్లడ్ బ్యాంక్ సేవలతో అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటిస్తూ వైద్య సేవలు అందిస్తున్నాం " అని తెలిపారు.ఖైహై రిస్క్ ప్రెగ్నెన్సీలను కాపాడే నమ్మకమైన కేంద్రంగా కామినేని ఆస్పత్రికి మంచి పేరు,



ఎం బ్రేస్ యూనిట్ ను ప్రారంభిస్తున్న భూమికామినేని

అనుభవం ఉండడంతో అత్యాధునిక ఎంబ్రేస్ విభాగాన్ని ప్రారంభించామనీ ఆమె తెలిపారు. అనంతరం ఎంఖిబ్రేస్ గురించి కార్యక్రమ ముఖ్యఅతిథి, ప్రముఖ నటి శ్రీమతి భూమిక చావ్లా మాట్లాడుతూ.. ప్రెగ్నెన్సీ అనేది సంరక్షణ, అవగాహన, కుటుంబ సభ్యుల నిరంతర మద్దతు అవసరమైన ప్రక్రియ. వైద్య చికిత్సతో పాటు తల్లుల భావోద్వేగ, మానసిక శ్రేయస్సును గుర్తించే ఎంబ్రేస్ ఒక చక్కని అధునాతన ఆలోచనాత్మక ప్రయత్నం. ఇది కామినేని ఆసుపత్రిలో అనేక కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువస్తుందని నమ్ముతున్నాను" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## అధునాతన హంగులతో ఉప్పల్ జోనల్ కార్యాలయం



ఉప్పల్ మున్సిపల్ ఆఫీసు వద్ద ఖాళీ షెటర్లు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిసి రాజు తదితరులు

**ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్నారు. గతంలో ఎల్బినగర్ పరిధిలో ఉన్న జోనల్ కార్యాలయాన్ని ఉప్పల్ సర్కిల్ ఆఫీసుకు మార్చిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ఉప్పల్ జోనల్ కార్యాలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కొత్తగా మంజూరు అయిన ఉప్పల్ జోనల్ కార్యాలయం కోసం అధికారులకు స్థలం సమస్య ఏర్పడింది. అధికారులు కూర్చునేందుకు కూడా ఇబ్బంది తలెత్తడంతో జోనల్ కార్యాలయాన్ని పోచారం మున్సిపాలిటికి తరలిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే ఉప్పల్ చౌరస్తాలో ఉన్న సర్కిల్ కార్యాలయం మొదటి అంతస్థులోనే తాత్కాలికంగా జోనల్ కార్యాలయం కొనసాగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం డిప్యూటి కమిషనర్ ఉపయోగిస్తున్న ఆఫీసులో జోనల్ కమిషనర్‌కు కేటాయించారు. గతంలో ఇంజనీర్‌కు కేటాయించిన గదిని డిప్యూటి కమిషనర్‌కు అప్పగించారు. ఇక మున్సిపల్ ఇంజనీర్‌ను వారి శాఖ సిబ్బంది ఉండే క్యాబిన్‌కు తరలించారు. కాగా

**అధికారులకు కొత్త చాంబర్లు .. ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు**

జోనల్ కమిషనర్ జిల్లా కలెక్టరేట్ బాధ్యతలు కూడా ఉండడంతో వారి సిబ్బంది కూడా ఉప్పల్‌లోనే ఉంటున్నారు. ఇంజనీరింగ్ శాఖలో రెండు క్యాబిన్‌లు వారికి కేటాయించారు. అయితే జోనల్ కార్యాలయం తరలింపుపై పలువురు ప్రజాప్రతినిధుల నుంచి కూడా వ్యతిరేకత రావడంతో ఉప్పల్‌లోనే కొనసాగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది.

**అధునాతన హంగులతో కొత్త చాంబర్లు :**

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రస్తుతం ఉన్న సీట్లను పలువురు అధికారులకు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప్పల్ జోనల్ కమిషనర్‌తోపాటు, ఎస్‌ఇ, డిఇ, ఎసిపి ఇతర అధికారులు కూడా ఉండడంతో వారికి సీట్లు కేటాయించేందుకు నిర్ణయించారు. ఇప్పటికే సర్కిల్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ షెటర్లను జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిసి రాజు పరిశీలించారు. ఖాళీగా ఉన్న షెటర్ల వివరాలు జోనల్ కమిషనర్ తెలుసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన దుకాణాలు ఖాళీ చేయించాలని ఆమె ఆదేశించారు. ఉప్పల్ సర్కిల్ ఆఫీసు వెనుక ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికారులు,బయటి వ్యక్తుల కార్లు, ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా సర్కిల్ కార్యాలయం వెనుక చెత్తాచెదారం ఉండడంపై జోనల్ కమిషనర్ తొలగించాలని ఆదేశించారు. సర్కిల్ ఆఫీసు వెనుక ఉన్న షెటర్లు స్టోర్ రూమ్‌లు ఉపయోగించాలని నిర్ణయించారు. వచ్చే నెల రోజుల్లో ఉప్పల్ జోనల్ కార్యాలయం అధునాతన హంగులతో ఏర్పాటు కానుందని అధికారులు పేర్కొంటున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

**ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎంవిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అధికారుల ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంవిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనదారులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వాహనదారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంవిఐ శ్రీనివాస్ తదితరులు

## ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో గంగిరెద్దులతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో కనుమ పండుగ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన గంగిరెద్దులు విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరూలు, పిట్టలదొర తదితర వేషాలు సందర్శకులను ఎంతో ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చంద్రశేఖర్ గారి బృందం గోదా కళ్యాణం నృత్య రూపకం ఎంతగానో అలరించింది. సంక్రాంతి సందర్భంగా శిల్పారామం సందర్శకులతో సందడి నెలకొంది. పలువురు స్థానికులు శిల్పారామంలో ప్రదర్శనలు తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. .

## ఖమ్మంలో సిపిఐ శతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి : కాసర్ల నాగరాజు

**నేరేడ్‌మెట్, జనవరి 16,ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ల పండుగలను ఖమ్మం వేదికగా ఘనంగా నిర్వహించనున్నట్లు, ఈ సందర్భంగా జరగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.శతాబ్ది ఉత్సవాల తొలి రోజున జరిగే బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు పలువురు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ బహిరంగ సభకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలతో పాటు 45 దేశాల నుంచి కమ్యూనిస్టు ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.తదుపరి రోజుల్లో అన్ని వామపక్ష పార్టీలతో కలిసి ఐక్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు దోహదపడతాయని, వామపక్ష శక్తులు ఏకమైతే అధికారాన్ని సాధించడం అసాధ్యం కాదని కాసర్ల నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులన్నీ అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వామపక్ష ఐక్యత అవసరమని, ఈ శతాబ్ది ఉత్సవాలు కొత్త దిశను చూపుతాయని తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయంలో రోడ్డు భద్రతపై అవగాహన



**నేరేడ్ మెట్, జనవరి 16,ప్రభాతవార్త:** రైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో రెండో రోజు భాగంగా మల్కాజ్‌గిరి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నేరేడ్ మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ్యనిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.అలాగే కార్యాలయానికి వచ్చే ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను నిర్వాహకులు కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఉచిత వైద్య శిబిరాలను చేసుకోవాలి:సుమన్‌గౌడ్



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

**ఎల్.బి.నగర్, జనవరి 16 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్ కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభిస్తుందని రంగారెడ్డి జిల్లా బిజెపి కమిటీ సభ్యుడు బత్తుల సుమన్ గౌడ్ తెలిపారు. ఆర్థో, జనరల్ ఫిషియన్, కంటి, దంత వైద్యానికి సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యులు అనిల్, శ్రీకాంత లు ఆరోగ్యపరమైన సలహాలు సూచనలు కూడా అందజేశారని సుమన్‌గౌడ్ తెలిపారు. అదేవిధంగా పలురకాల రక్త పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల కాలనీవాసుల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. భవిష్యత్తులో కూడా ఉచిత వైద్య శిబిరాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ప్రజల ఆరోగ్య సంరక్షణ దృష్టి లో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ




ప్రదర్శనలో పాల్గొన్న కృష్ణయ్య, మక్బూల్‌జానీ, శ్రీధర్, అభిలాష్

**ఎల్.బి.నగర్, జనవరి 16 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతకు సంబంధించి ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ, నాగోల్ ఎంవిఐ శ్రీధర్, ఏఎంవిఐ అభిలాష్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించి ఉన్న సూచనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ వేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో వాహనాలు నడపడం చట్ట విరుద్ధం అన్నారు. ప్రభుత్వం సూచించిన భద్రత ప్రమాణాలను పాటించినప్పుడే అందరూ సురక్షితంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, సిబ్బంది, బస్సు డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూ టెస్టమెంట్ చర్చ్ క్యాలెండర్ ఆవిష్కరణ




**నేరేడ్‌మెట్, జనవరి 16, ప్రభాతవార్త:** నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రముఖ సంఘ సేవకుడు, క్రైస్తవ నాయకుడు సెర్ల అనిల్ కుమార్ నూతన సంవత్సరం సందర్భంగా న్యూ టెస్టమెంట్ చర్చ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది.ఈ సందర్భంగా అనిల్ కుమా ర్ మాట్లాడుతూ, సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో మరింత విస్తరింపజేయడమే చర్చ్ లక్ష్యమని తెలిపారు. ఐక్యత, సేవాభావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, గాయంరాయం విజయరాణి, పద్మ, శ్రీనివాస్, కిషోర్, ఉషా, సంపత్, తివెంతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోడ్డు భద్రతపై అవగాహన పెంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్స్పెక్టర్ సైదులు

**ఎల్.బి.నగర్, జనవరి 16 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచే విధంగా సిబ్బంది కార్యక్రమాలు చేపట్టాలని చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమానికి సంబంధించి చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో సిబ్బందికి శుక్రవారం ఇన్స్పెక్టర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పాటించాల్సిన విధి విధానాల గురించి కూడా వివరించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రవాణా శాఖ రూపొందించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో ప్రమాణం చేయించారు.

## ఆటోలను దొంగలిస్తున్న పాత నేరస్థుడు అరెస్ట్ నాలుగు ఆటోలు స్వాధీనం



ఆటోలను దొంగలిస్తున్న పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి ఆటోలను స్వాధీనం చేసుకున్న ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, ఎస్ఐ భరత్ తదితరులు

**మలక్ పేట, జనవరి 16, ప్రభాతవార్త:** నగరంలోని పలు ప్రాంతాలలో ఆటోలను దొంగలిస్తున్న ఓ పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్న సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి కథనం ప్రకారం.. చాదర్ ఘాట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సబిర్ అహ్మద్ తన ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దీంతో సబిర్ అహ్మద్ చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చెయ్యడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తన సిబ్బందితో కలిసి గురువారం అజంపురా ప్రాంతంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ఈది బజార్ కు చెందిన మహ్మద్ సిరాజ్ ని నించి పోలీసులు అదుపులో తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో చాదర్ ఘాట్, సుల్తాన్ బజార్, సరూర్ నగర్, సంతోష్ నగర్, అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోల దొంగతనం కేసుల్లో పోలీస్ కేసులు నమోదైనట్లు అంగీకరించాడు దీనితో చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడి నివాసం సమీపంలో దాచి ఉంచిన నాలుగు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడు మహ్మద్ సిరాజ్ ని ఆరెస్టు చేసారు. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గొనె సాల్మన్ రాజుకు క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ పాస్టర్లు ప్రభు చరణ్ తదితరులు

**మలక్ పేట, జనవరి 16, ప్రభాతవార్త:** ప్రొటెస్టెంట్ క్రైస్తవుల ప్రతినిధి గొనె సాల్మన్ రాజు కు క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించాలని మలక్ పేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మూసారం బాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.ఎస్ ప్రభు చరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాస్టర్లు రెవరెండ్ మెన్నోజోయల్, బిషప్ తిమోతి, రెవరెండ్ డాక్టర్ బోడి సాల్మన్, సామ్యేల్ బాబు, మాణిక్యం అబ్రాహాము, వన్య ఇమ్మానుయేల్ , యిర్మీయా, ప్రశాంత్, విజయ్ కుమార్ మాట్లాడుతూ.. క్రైస్తవుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరేలా పని చేసే గొనె సాల్మన్ కు మైనారిటీ కార్పొరేషన్ స్థానం కల్పిస్తే మరింతగా మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రొటెస్టెంట్ క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు.సమావేశంలో పాస్టర్లు శాంత్ కుమార్, శ్రీధర్ రాజు, జాన్ పాల్ , కీర్తి ప్రకాశ్, ఆనంద్, ధన రాజ్ ,అబ్రహం సన్, యేసురత్నం, జి పాల్ ,అశోక్ ,రాజేష్ ,ఆంథోనీ ,జాషువా క్రిస్టోఫర్, సుదర్శన్, కమ లాకర్ ,రాజమ్మ, శ్రీనివాస్, సాల్మన్ జోబ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



రామంతాపూర్ చెరువు కట్టపై పతంగులు ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పలు చోట్ల ఇళ్లపై పతంగులు వేస్తూ నేతలు సంబరాలు చేసుకున్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు బండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పలువురు పార్టీ నేతలతో కలిసి పతంగులు ఎగురవేశారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో చేసుకోవాలని ఆయన సూచించారు. చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పలువురు పార్టీ నేతలతో కలిసి పతంగులు ఎగురవేశారు. చిలుకానగర్‌లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పతంగులు ఎగురవేశారు. వివిధ పార్టీల నేతలు చిన్నారులకు ఉచితంగా పతంగులు పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా రంగురంగుల రంగవల్లులతో ఇళ్ల ముందు ముగ్గులు వేసి తీర్చిదిద్దారు.

## బోడుప్పల్ సర్కిల్ దేవేందర్ నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్ సర్కిల్ దేవేందర్ నగర్ కాలనీ నూతన అధ్యక్షులుగా మైల సోమయ్య , బోడగళ్ళ సదానంద్,మరాటి మచ్చగిరిని సన్మానిస్తున్న కాలనీ ప్రతినిధులు

**బోడుప్పల్, జనవరి16 ప్రభాతవార్త :** బోడుప్పల్ సర్కిల్ దేవేందర్ నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నుకున్నారు .కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం , ప్రజల ఐక్యత కోసం కొక్తమిటీని ఎన్నుకున్నామని నూతన అధ్యక్షులు మైల నర్సింహ్మ తెలిపారు.నూతన కమిటి సభ్యులు మాట్లాడుతూ... దేవేందర్ నగర్ కాలనీ అభివృద్ధి, పారిశుద్ధం,రోడ్లు,త్రాగునీరు,వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి సమస్యలను అధికారుదృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.నూతన కమిటి ముఖ్య సలహాదారులుగా మరాటి మల్లేష్, కుక్కల చంద్రయ్య, మైల సోమఅధ్యక్షులుగా మైల నర్సింహ్మప్రధాన కార్యదర్శిగా బోడగళ్ళ సదానంద్,కోశాధికారిగా మరాటి మత్స్యగిరి ,ఉపాధ్యక్షులుగా దండు రమేష్,సంయుక్త కార్యదర్శిగా కుక్కల రాజు,ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరమల్లు వెంకటేష్,పాతకోటి దేవరాజుకార్యవర్గ సభ్యులుగా కుక్కల వెంకటేష్,రేగు కుమార్,మల్లేహన్మంత్ రాజు.మంగ ప్రశాంత్,వాసూరి చందు,చెవ్వేల శివ,శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.